సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల పట్ల కఠినంగా వ్యవహరించి పోలీసుశాఖ విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. -8లో



హత్య కేసులో నిందితుడు అరెస్టు

నందలూరు మండలంలోని ఎర్రచెరువుపల్లిలో గత ఏడాది జరిగిన హత్య కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 515 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	480	616
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 351.180 కిలోలు

న్యూస్‌రీల్

మే 10న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మే 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు 08562 258622, 244622 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే కడప. డీకోర్ట్స్.జీఓవి.ఇన్, డిఎల్ఎస్ఏకేడిపి అట్‌ది డేటాఫ్ జి మెయిల్.కంలోనూ సంప్రదించవచ్చని వివరించారు.కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: విజయవాడ కీట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూ జీకేవై కార్యక్రమం ద్వారా వివిధ సాఫ్ట్‌వేర్ కోర్సులతోపాటు జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్ కోర్సులో ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ, భోజన వసతి సౌకర్యం కల్పిస్తామని సంస్థ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ కేంద్రంలో ఇచ్చే శిక్షణలో ప్రతి విద్యార్థికి సీ, సీ++, జావా స్క్రిప్ట్, పైథాన్, వెబ్ డిజైనింగ్, జేఎస్‌డీ కోర్సులతోపాటు స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్ లైఫ్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామని వివరించారు.అభ్యర్థులు 20-30 ఏళ్లలోపు కలిగి డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కోర్సులో చేసి ఉండాలన్నారు. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.


హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో హజ్ కమిటీ ద్వారా గురువారం స్థానిక రాధాకృష్ణనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ 125 మందికిగాను 115 మందికి వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. ఇంకా ఈ టీకాలు వేయించుకోని హజ్ యాత్రికులకు తిరిగి ఈనెల 28వ తేదిన టీకాలు వేయనున్నట్లు వివరించారు. ఈ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి పెంచలకోనకు ప్రత్యేక బస్సు

రాజంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు శుక్రవారం నుంచి రాజంపేట డిపోకు చెందిన ప్రత్యేక సర్వీసును నడపనున్నట్లు ఆర్టీసీ రాజంపేట డిపో ఏనేజర్ రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఉదయం 5.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి 6.30 గంటలకు కడప బస్టాండుకు చేరుతుందని పేర్కొన్నారు. అనంతరం 6.40 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి రాజంపేట, చిట్వేలి, రాపూరు మీదుగా ఉదయం 10.45 గంటలకు పెంచలకోనకు చేరుతుందని వివరించారు. తిరిగి 11.15 గంటలకు పెంచలకోనలో ఇదే మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 1.45 గంటలకు రాజంపేటకు చేరుతుందని వివరించారు. తిరిగి 2.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి రాపూరుకు 3.15 గంటలకు చేరుతుందని తెలిపారు. 4 గంటలకు రాపూరులో బయలుదేరి చిట్వేలి, రాజంపేట మీదుగా కడపకు రాత్రి 7 గంటలకు చేరుతుందన్నారు. రాత్రి 8.15గంటలకు బయలుదేరి రాజంపేటకు వస్తుందని చెప్పారు.ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనివ్వాలి



మాట్లాడుతున్న అగ్రికల్చర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవితేజ

ఒంటిమిట్ట: పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సుస్థిర వ్యవసాయ సంస్థ అగ్రికల్చర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవితేజ పేర్కొన్నారు.గురువారం ఒంటిమిట్ట రైతు సేవా కేంద్రంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సిట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ యాజమాన్య పద్ధతుల ద్వారా పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఒంటిమిట్ట, సుండుపల్లి, ఓబులవారిపల్లి మండలాలకు చెందిన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. మొక్కల పెరుగుదలకు పురుగులు, తెగుళ్ల నివారణకు పాటించాల్సిన సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి రవితేజ వివరించారు. మొక్కల ఎంపిక, నాటే విధానం, నీటి యాజమాన్య పద్ధతుల గురించి సుస్థిర వ్యవసాయ సంస్థ ఆర్ డబ్ల్యూబి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ విద్యాసాగర్ వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సోషల్ మొబులైజర్ ఓబులేశు, ఎఫ్‌పీఓ చైర్మన్ సుబ్బరాయుడు, సుస్థిర వ్యవసాయ సంస్థ న్యాచురల్ ఫార్మింగ్ కో-ఆర్డినేటర్ అనుషా పాల్గొన్నారు.

టమాటా రైతు నిలువు దోపిడీ

- జాక్‌పాట్, పదిశాతం కమీషన్ పేరుతో వ్యాపారుల బాదుడు
- తుంగలో తొక్కుతున్న నిబంధనలు
- కుంగిపోతున్న సాగుదారులు



మార్కెట్‌యార్డులో నాలుగుశాతం కమిషన్, జాక్‌పాట్‌రద్దు అని బోర్డులు పెట్టిన దృశ్యం



వేలం పాటల సమయంలో క్రీట్లపై అదనంగా పోసిన టమాటాలు

గుర్రంకొండ: జాక్‌పాట్ పేరుతో వ్యాపారులు టమాటా రైతులను దోచుకుంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట దళారుల పాలవుతోంది.వందక్రీట్లకు 20 క్రీట్లు జాక్‌పాట్ రూపంలో తీసుకుంటున్నారు. దీనికితోడు పదిశాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. మార్కెట్లో వ్యాపారులు,దళారులు పాడిందే పాటగా మారింది. మార్కెట్‌యార్డులో ఎక్కడ కూడా ప్రభుత్వ నిబంధనలు అమలు కాక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వేధింపులకు దిగుతూ దిక్కున్నచోట చెప్పుకోండి అంటూ వ్యాపారులు సవాల్ విసురుతున్నారు. దీంతో చేసేదిలేక పలువురు రైతులు తాము పండించిన టమాటాలను కర్ణాటక రాష్ట్రానికి తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

● పడమటి మండలాల్లో మదనపల్లె తర్వాత గుర్రంకొండ మార్కెట్‌యార్డు అతిపెద్దది. ప్రతినిత్యం 40 నుంచి 50 లారీలోడ్ల టమాటాలు ఇక్కడికి వస్తుంటాయి. సుమారు 30 టమాటా మండీలు నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడి వచ్చి టమాటాలు కొనుగోలు చేస్తుంటారు. అయితే స్థానిక వ్యాపారులు జాక్ పాట్ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. జాక్ పాట్ ఉండకూడదనేది ప్రభుత్వ నిబంధన. అయితే నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ప్రతి వందక్రీట్లకు 20క్రీట్లు జాక్‌పాట్ వదులుతున్నారు. రైతులు వేలంపాటకు సిద్ధంగా ఉంచిన టమాటా క్రీట్లపై మరో పదిక్రీట్లు ఎత్తుగా పోస్తున్నారు. వేలం పాట సమయంలో జాక్‌పాట్ అంటూ వందకు 20 క్రీట్లు తీసుకొంటున్నారు. ఈలెక్కన వందక్రీట్లకు 25 క్రీట్లు జాక్‌పాట్ పేరుతో వ్యాపారులు దోచుకొంటున్నారు.

వ్యాపారుల సవాల్

జాక్ పాట్ దోపిడీ గురించి నిలదీసే రైతుల పట్ల వ్యాపారులు దురుసుగా వ్యహరిస్తున్నారు. ఎవరికి ఫిర్యాదు చేస్తారో చేసుకోండి.. మీకు దిక్కున్నచోట చెప్పుకోండి.. మా ఇష్టం వచ్చినట్లు మేము వ్యాపారం చేస్తాం అంటూ సవాల్ విసురుతున్నారు. ధర్నాలు చేస్తారా చేసుకోండి, అధికారులు కూడా మమల్ని ఏమి చేయలేరని విర్రవీగుతున్నారు. దీంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక రైతులు ఆవేదన చెందుతున్నారు.

కర్ణాటకకు తరలిపోతున్న రైతులు

పలువురు రైతులు తాము పండించిన టమాటాలను కర్ణాటక రాష్ట్రానికి తరలించి విక్రయించుకొంటున్నారు. కర్ణాటకలోని కోలార్, చింతామణి, శ్రీనివాసపురం వంటి పట్టణాల్లోని మార్కెట్లకు ఇక్కడి రైతులు టమాటాలు తీసుకెళుతుండడం గమనార్హం. అక్కడి మార్కెట్లలో ప్రభుత్వ నిబంధనల మేరకే వ్యాపారులు నడుకొంటారని రైతులు చెబుతున్నారు. ఇటీవల జాక్‌పాట్‌ను నిరసిస్తూ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు లిఖిత పూర్వకంగా మార్కెట్‌కమిటీ కార్యదర్శి, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు.

పదిశాతం కమీషన్ వసూలు

జాక్‌పాట్‌ల దోపిడీ కాకుండా బిల్లు వేసేటప్పుడు పదిశాతం కమీషన్ తీసుకొంటున్నారు.ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగుశాతం మాత్రమే వసూలు చేయాల్సి ఉంది.ఈ మేరకు ప్రతి మండీ వద్ద ఇప్పటికీ 4 శాతం మాత్రమే కమీషన్ అనే బోర్డులు ఉన్నాయి. అయితే పేరుకే బోర్డులు వేశారు తప్ప నిబంధనలు అమలు కావడంలేదు. మార్కెట్‌యార్డుకు టమాటాలను తీసుకొచ్చే రైతుల వద్ద 10శాతం కమీషన్‌తో పాటు క్రీట్‌కూలీ రూ.2, క్రీట్ బాడుగ రు.2 వసూలు చేస్తున్నారు. దీంతో ఒక క్రీట్ మార్కెట్‌యార్డుకు చేరేసరికి కోతకూలీ, రవాణా ఖర్చులు, మండీల ఖర్చులు కలుపుకొంటే రు. 24 నుంచి రూ. 30 వరకు ఖర్చు వస్తోంది.

దళారులు పాడిందే పాట

మార్కెట్‌యార్డులో దళారులు పాడిందే పాటగా మారింది. బయట ప్రాంతాల్లో టమాటా ధరలు ఎలా ఉన్నా ఇక్కడి వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి వారే ఒక ధర నిర్ణయించేస్తున్నారు. అన్ని మండీల్లోనూ అవే ధరలు వేలం పాటల్లో పాడుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. జాక్‌పాట్‌పైగానీ, పదిశాతం కమీషన్లపై ప్రశ్నించే రైతులపై దళారులు కక్ష గడుతున్నారు. సదరు రైతులు తెచ్చిన టమాటాలను మార్కెట్ ధర కంటే 50శాతం తక్కువకే వేలం పాడి వేధింపులకు గురి చేస్తున్నారు. వేలంలో పాడిన డబ్బుల కోసం రోజుల తరబడి తిప్పుకొంటూ కష్టాలకు గురిచేస్తున్నారు.



కష్టాన్ని దోచుకుంటున్నారు



పదేళ్ల నుంచి టమాటా సాగు చేస్తున్నాను.ఎకరా సాగుకు 2.50 లక్షలు ఖర్చు వస్తుంది. మార్కెట్‌లో వ్యాపారుల దోపడీతో సగం పెట్టుబడి కూడా రావడంలేదు. మా కష్టాన్ని దోచుకుంటున్నారు. ఇదేమిటని అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు.
– అమరనాథ్, టమటా రైతు, గుర్రంకొండ

కర్ణాటకకు తీసుకెళుతున్నాం



గుర్రంకొండలో టమటా వ్యాపారుల ఆగడాలు భరించలేక తాము పండించిన పంటను కర్ణాటకా రాష్ట్రంలోని కోలార్ మార్కెట్‌కు తీసుకెళుతున్నాం. గతంలో తాము గుర్రంకొండ మార్కెట్‌యార్డుకే తీసుకొచ్చేవాళ్లం. జాక్ పాట్, అధిక కమీషన్ల పేరుతో రైతుల్ని వ్యాపారులు వేధించేవాళ్లు. దీంతో పక్క రాష్ట్రానికి తీసుకెళుతున్నాం.
– రెడ్డిశేఖర్, టమాటా రైతు, ఎల్లుట్ల శీలంవారిపల్లె

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గుర్రంకొండ మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ పేరుతో రైతుల దోచుకొంటున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. గతంలో కూడా ఇలా జరిగినట్లు తమకు ఫిర్యాదులు అందాయి. వీటిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరిస్తాం.
– కుమార్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

దివ్యాంగుడికి ఎంపీ మిథున్‌రెడ్డి చేయూత

కృత్రిమ చేతులకు రూ. 6.35 లక్షలు వితరణ



దేవేంద్ర




ఎంపీ మిథున్‌రెడ్డితో దేవేంద్ర కుటుంబసభ్యులు

పీలేరు: మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ తూగుంటపల్లెకు చెందిన కృష్ణయ్య, భారతీల కుమారుడు ఇంజినీరింగ్ విద్యార్థి అయిన దేవేంద్ర గత సంవత్సరం ఆగష్టు 15న విద్యుదాఘాతంతో రెండు చేతులు, ఒక కాలు కోల్పోయాడు. దాదాపు రూ. 20 లక్షలు ఖర్చుపెట్టి వైద్యం చేయించడంతో కోలుకున్నాడు. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఇటీవల రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. వారి పరిస్థితి చూసి చలించిన ఎంపీ తక్షణం స్పందించి దేవేంద్రకు కృత్రిమ చేతులకు అయ్యే ఖర్చు రూ. 6.35 లక్షలు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. అంతేగాక వారి కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కృత్రిమ చేతులకు అయ్యే ఖర్చు అందజేశారు. త్వరలో కృత్రిమ చేతులు అమర్చనున్నారు. దీంతో ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టుదలతో బీటెక్ పూర్తి...

దేవేంద్ర ప్రమాదానికి గురైన సమయంలో కడప కేఎంఎస్‌ఆర్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదివేవాడు. ప్రమాదంలో చేతులు, కాలు కోల్పోయినా ధైర్యాన్ని కోల్పోకుండా పట్టుదలతో బీటెక్ నాలుగో సంవత్సరం ఇటీవల పూర్తి చేశాడు.

ఎంఎస్‌ఎంఈల సాధికారతతో రాష్ట్రాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మంత్రి శ్రీనివాస్

కడప సెవెన్‌రోడ్స్: సూక్ష్మ,.చిన్నతరహా పరిశ్రమల సాధికారతతోనే రాష్ట్ర సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు, ఎంఎస్‌ఎంఈల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా రాణించాలన్నారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లా నుంచి ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు, బెరైటీస్, బేరియం క్లోరైడ్ వంటి ఉత్పత్తులు అధికంగా ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవీరెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రీలో మ్యాన్ పవర్ అవసరం చాలా ఎక్కువగా ఉందన్నారు. స్థానిక యువత అందుబాటులో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడారు. టిక్కి ఆర్గనైజేషన్ ప్రతినిధి రామ్మూర్తి నాయక్, డిక్కి కో-ఆర్డినేటర్ శివశంకర్, ఫ్యాప్సియా ప్రతినిధి గల్లా శ్రీధర్, జ్ఞాన ప్రకాశ్‌లతోపాటు ఏపీఐఐసీ, పరిశ్రమలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌పై అపోహలు వద్దు

కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌పై జిల్లాలో అపోహలు వద్దని ఎంఎస్‌ఎంఈ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్‌ఆర్‌ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. టెక్నాలజీ సెంటర్‌ను ఇక్కడే ప్రతిపాదించామని చెప్పారు. పీపీపీ మోడల్‌లో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామిని గుర్తించే పనిలో ఉందని తెలిపారు. మే 1వ తేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో 10 ఎంఎస్‌ఎంఈ పార్కులను ప్రారంభిస్తారని చెప్పారు. వైఎస్సార్ జిల్లాలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్కుకు ప్రారంభోత్సవం చేస్తామని, మరో రెండు పార్కులకు భూమిపూజ నిర్వహిస్తామని వెల్లడించారు.

ఏపీఐఐసీ నుంచి సేల్ రిజిస్ట్రేషన్లు చేయించండి

కడప కార్పొరేషన్: సేల్ రిజిస్ట్రేషన్ల సమయంలో ఏపీఐఐసీ నుంచి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని మైదుకూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిశ్రమల యజమానులు కోరారు. గురువారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను వారు కొప్పర్తి పారిశ్రామికవాడలో కలిసి వినతి పత్రం అందజేశారు. సూక్ష్మ పరిశ్రమలకు పీఎఫ్, ఈఎస్ఐలతో నిమిత్తం లేకుండా ఏపీఐఐసీ సేల్ రిజిస్ట్రేషన్లు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కొప్పర్తి, మైదుకూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధులు పల్లేటి రమణారెడ్డి, మదన్‌కుమార్, కిశోర్‌బాబు, కేవీ సురేష్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో మంత్రి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్ తదితర పరికరాలను అందజేశారు. రాబోయే రోజుల్లో అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వపథకాలు అందేలా చర్యలు తీసుకుంటామ్మనారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ 243 మంది విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్ అందజేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు నగదు బహుమతి

పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులతో రాణించిన విద్యార్థులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు కలిసి నగదు బహుమతి అందజేశారు. వీరబల్లి మండలం, పెద్దవీడు గ్రామం, జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న మేఘన పదోతరగతిలో 595 మార్కులు, మదనపల్లి మండల పరిధిలో నేరుగట్టుపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థినీ బి ధనుశ్రీ 591 మార్కులు సాధించిన వీరిద్దరికి మంత్రి క్యాష్ ప్రైజ్ అందజేశారు.



పది ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన మేఘనకు నగదు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్

శభాష్.. ఆచార్యా!

పుస్తకాలు చేతబట్టి పాఠాలు వల్లెవేసిన పల్లెటూరి పిల్లాడు.. నేడు అవే పుస్తకాలు చేతబట్టి విద్యార్థులకు బోధిస్తూ..
తన పరిశోధనలతో దేశ, విదేశాల్లో ఖ్యాతినర్జిస్తూ పుట్టినగడ్డకు పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్నాడు. తాజాగా రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా నియమితులు కావడంతో పాటు సంస్థ రాయల్‌సొసైటీ బ్యాడ్జిని అందుకున్నాడు. ఆయనే ఆచార్య సుధాకర్ రెడ్డి.

- కడప ఆచార్యుడు సుధాకర్ రెడ్డికి అరుదైన గౌరవం
- పలు పేటెంట్లు కైవసం
- దేశ, విదేశాల్లో పరిశోధన



యూకే పేటెంట్‌ను నాగ్‌పూర్ ప్రొఫెసర్ దోబ్లే, వైవీయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి నుంచి అందుకుంటున్న ఆచార్య బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి



డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: చింతకొమ్మదిన్నె మండలం గూడావాండ్లపల్లెకు చెందిన సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన బుసిరెడ్డి మల్లారెడ్డి, మల్లమ్మల కుమారుడైన డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రాథమిక విద్య బయనపల్లె ఎస్.వి. హైస్కూల్‌లో పూర్తి చేశాడు. అనంతరం డాక్టర్ పంద్రా కోటేశ్వరమ్మ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఎస్.వి. డిగ్రీ కళాశాలలో డిగ్రీ, తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేశారు. అనంతరం తాను చదివిన ఎస్.వి. డిగ్రీ కళాశాలలోనే అధ్యాపకుడుగా ప్రస్తానం ప్రారంభించారు. ప్రస్తుతం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతికశాస్త్ర ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

పరిశోధనల్లో ఘనాపాటి..

డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి పరిశోధన రంగంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే ఆయనకు రెండు యూకే పేటెంట్లు ఉండగా, 75 పైగా అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. 2008లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ఈయన 2017లో ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారాన్ని అందుకున్నాడు. 2018లో ఎస్ఈఎస్ఏ ఫెలోగా పరిశోధనలో ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నాడు. అదే ఏడాది విశిష్ట ప్రొఫెసర్ అవార్డును, 2024లో జాతీయ అధ్యాపక అవార్డును అందుకున్నారు. అదే విధంగా నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ (న్యాక్) కమిటీ మెంబర్‌గా కూడా వ్యవహరించారు. ఏడీ ర్యాకింగ్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తల జాబితాలో భారతదేశం నుంచి ఎంపికైన అతికొద్ది మంది భౌతికశాస్త్రవేత్తలో ఈయన ఒకరుగా నిలిచారు. ఇప్పటివరకు ఈయన 101 జర్నల్స్, 3 పుస్తకాలు, కోట్లాది రూపాయలు విలువ చేసే 6 ప్రాజెక్టులు పూర్తి చేశారు.

రెండు పేటెంట్లు...

'డివైజ్ ఫర్ కంట్రోలింగ్ ది స్టెమ్ బోరర్ ఇన్‌సెక్ట్ ఇన్ ట్రాప్ మేనేజ్‌మెంట్'అన్న అంశంపై ఈయన పరిశోధన వ్యాసానికి 2025 జూలై 10వ తేదీన యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన కంప్ట్రోలర్ జనరల్‌ఆఫ్ పేటెంట్స్ ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ వారు పేటెంట్ సర్టిఫికెట్ (పేటెంట్ నెంబర్ 6377539) అందజేశారు. ఈ పరిశోధనల ద్వారా ఎల్ఈడీ, నూనెలను ఉపయోగించి కీటకాలను రెండు విధాలుగా ఆకర్షించడానికి వినూత్న పరికరాన్ని రూపొందించారు. అదే విధంగా వేస్ట్ హెచ్‌జీ బేస్డ్ ల్యాంప్స్ కలెక్టింగ్ డివైజ్‌పై చేసిన పరిశోధనకుగాను పేటెంట్ నెంబర్ 6404043ను 2024 నవంబర్ 22న పొందారు.



2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకుంటూ..

రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా..

ప్రపంచవ్యాప్తంగా 50వేల మంది సభ్యులుగా ఉండే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా అవకాశం దక్కించుకున్న ఈయన తాజాగా సొసైటీ వారు మెటీరియల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల్లో చేసిన ప్రతిభను గుర్తించి ఎఫ్‌ఆర్‌ఎస్‌సీ (ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ) అందించారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను, అదే విధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 'రాయల్ సొసైటీ బ్యాడ్జి'ను డా. బుసిరెడ్డికి పంపడం విశేషం.

▶▶ పాఠాలు చెప్పిన అధ్యాపకులకే గైడ్‌గా..

తనకు డిగ్రీలో పాఠాలు చెప్పిన అధ్యాపకులు పి. గిరిధర్, భూషణ్‌రెడ్డిలకు.. తర్వాత కాలంలో ఆయనే వారికి గైడ్‌గా వ్యవహరించి పీహెచ్‌డీలు అందించారు. ఇప్పటి వరకు 8 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ గైడ్ వ్యవహరించి వారికి డాక్టరేట్ రావడంతో కృషిచేశారు. ప్రస్తుతం మరో ఇద్దరు పరిశోధకులు ఈయన వద్ద పరిశోధనలు చేస్తున్నారు. 2010లో తొలుత విదేశాల్లో పరిశోధనలు ప్రారంభించిన ఈయన ఇప్పటి వరకు సౌత్‌కొరియా, హాంకాంగ్, స్వీడన్, ఫిన్‌లాండ్, సౌత్ ఆఫ్రికా దేశాల్లో పరిశోధనలు చేశారు.

క్లుప్తంగా

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన రాజేష్(30) మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తుండటంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన రాజేష్ గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వాల్మీకిపురానికి చెందిన అరుణ (31) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు విచారణ చేస్తున్నారు.

మెడికల్ క్యాంపును వినియోగించుకోవాలి

రాయచోటి జగదాంబసెంటర్ : ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వులతో జరగబోవు ఉపాధ్యాయుల బదిలీల కోసం ఈ నెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో జరిగే మెడికల్ క్యాంపును ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపునకు అర్హత గల ఉపాధ్యాయులందరూ తమ వద్ద గల ఒరిజినల్ మెడికల్ ధృవపత్రాలతో పైన తెలిపిన తేదీలలో తప్పకుండా హాజరుకావాలన్నారు. 40 శాతం నుంచి 55 శాతం వరకు ఉన్న పీహెచ్ ఉపాధ్యాయులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ తప్పక చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోని ఉపాధ్యాయులను పీహెచ్‌సీ/ప్రిఫరెన్షియల్ క్యాటగిరీ నుండి తొలగిస్తామన్నారు. వారిని సాధారణ కేటగిరీ కింద అనుమతిస్తామని ఆయన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రాయచోటి, మదనపల్లె, రాజంపేట డివిజన్ పరిధిలోని అన్ని ప్రధాన కేంద్రాలలో గురువారం జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అసాంఘిక శక్తులను నియంత్రించే క్రమంలో ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా అదనపు ఎస్పీ వెంకట్రాది తెలిపారు. తమ సిబ్బంది వేర్వేరు ప్రదేశాలలో వాహనాల తనిఖీ నిర్వహించి రికార్డులు సరిగా లేని 10 ద్విచక్రవాహనాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 12 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ద్విచక్రవాహనాలపై రూ.1,09,075 జరిమానా విధించినట్లు చెప్పారు. నేరాలు నియంత్రించే క్రమంలో డ్రోన్ కెమెరాల టెక్నాలజీని ఉపయోగిస్తామన్నారు. ప్రజలు ఊరికి వెళ్లినట్లు అయితే మీ బంధువులు కానీ, నమ్మకమైన వారికి మీ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలన్నారు. విలువైన వస్తువులు ఇంటిలో లేకుండా నగదు కూడా ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే 100/112 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ప్రకృతి సమతుల్యత కాపాడాలి

కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్

సిద్దవటం : ప్రకృతిలో సమతుల్యత దెబ్బతినడం వల్లనే ఎండలు తీవ్రంగా ఉన్నాయని కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ తెలిపారు. సిద్దవటం మండల శివారులోని రాజీవ్ స్మృతివనంలో గురువారం కడప స్థానిక అటవీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. స్థానిక జాతి మొక్కలను అటవీ ప్రాంతంలో, ఇతర ప్రదేశాల్లో అభివృద్ధి చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అడవి జంతువుల రక్షణపై దృష్టిపెట్టాలని ఆయన అన్నారు. అటవీ సంరక్షణలో భాగంగా నర్సరీల ఏర్పాటుపై కూడా దృష్టి సారించాలని, నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వివరించారు. వర్మీ కంపోస్టు (ఎరువు) తయారీ విధానాన్ని కూడా ప్రజలకు వివరించారు. ఇది మొక్కల పెంపకంలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు. సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద మాట్లాడుతూ పర్యావరణాన్ని పచ్చదనంగా పెంపొందించు కోవాలంటే అటవీ సంపదను, చెట్లను అభివృద్ధి పరచుకోవాలన్నారు. ప్రాజెక్టు ఉద్దేశ్యం ఏమిటంటే స్థానికంగా ఉన్న ఎర్రచందనం, వేప, మర్రి, రాగి జువ్వి వంటి చెట్ల విత్తనాలను సేకరించి నర్సరీగా మొక్కలను పెంచాలని వాటిని అటవీ ప్రాంతాల్లో నాటాలన్నారు. వీటిపై జంతువులు, పక్షులు స్థావరాలు ఏర్పరచుకుంటాయన్నారు. దీంతో జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. అటవీశాఖ ఒక్కటే ఏపని చేయలేదని, అందరి సహాయ సహ కారం ఉంటే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకొని పోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సోషియల్ ఫారెస్టు డీఎఫ్ఓ శివకుమార్, ఉపాధి ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, టీచర్స్ ఎన్‌జీఓ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, కడప, సిద్దవటం రేంజర్‌లు ప్రసాద్, కళావతి, కడప డీఆర్ఓ ఎస్. ఓబులేస్, వన సంరక్షణ సిబ్బంది, అటవీ సిబ్బంది , ప్రజలు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వాహకులపై ఉక్కుపాదం


నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి

రాయచోటి : జిల్లాలో క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వాహకుల పట్ల కఠినంగా వ్యవహరించి పోలీసు శాఖ విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి ఆదేశించారు. గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లి సబ్ డివిజన్ నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి ఏఎస్పీ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరపాలని పలు సూచనలు చేశారు. నేర నిరూపణలకు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నేర పరిశోధన చేయాలన్నారు. గంజాయి రవాణ, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో మదనపల్లి డీఎస్పీ ఎస్ మహేంద్ర, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో యాచిస్తూ జీవనం చేస్తున్న గుర్తు తెలియని వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గురువారం స్థానికులు ఆ వృద్ధురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యులు హరికృష్ణ ఆ వృద్ధురాలిని పరిశీలించి ప్రథమ చికిత్స జరిపి తిరుపతి రుయాకు తరలించారు.

మనస్థాపంతో విద్యార్థిని మృతి


ఆత్మహత్య చేసుకున్న నవీన

ములకల చెరువు : పదో తరగతిలో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ పెద్ద మొరవ పల్లికి చెందిన చల్లా రెడ్డప్ప కుమార్తె చల్లా నవీన(15) పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్థాపానికి చెందిన నవీన గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.

పహల్గాం బాధితులకు సంతాపం


పహల్గాం బాధితులకు సంతాపం ప్రకటిస్తున్న జడ్జి కృష్ణన్‌కుట్టి, న్యాయవాదులు

రాయచోటి అర్బన్ : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులందరికీ సంతాపాన్ని రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి నేతృత్వంలో న్యాయవాదులు తెలిపారు. గురువారం ఉదయం కోర్టు విధులను ప్రారంభించే ముందు పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి 2 నిముషాల పాటు మౌనం వహించి సంతాపాన్ని ప్రకటించాలంటూ ఆయన న్యాయవాదులకు సూచించారు. న్యాయ మూర్తితో పాటు న్యాయవాదులంతా రెండు నిముషాల పాటు మౌనం వహించి సంతాపాన్ని తెలిపారు. అదేవిధంగా రాయచోటి సీనియర్ సివిల్‌జడ్జి ప్రసూన, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తేజస్విని ఆయా కోర్టు హాళ్లలో న్యాయవాదులతో కలసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డిబాష, ఉపాధ్యక్షుడు ధనుంజయకుమార్ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్..

రాయచోటి : రాయచోటి పట్టణ పరిధిలోని లక్ష్మీపురం ప్రాంతంలో గురువారం ఉదయం మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు సతీమణి ఇంటి శునకాన్ని పట్టుకొని వాకింగ్ చేస్తుండగా.. కాపు కాసిన దొంగలు బైకు మీద వచ్చి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ బీవీ చలపతి తెలిపారు.

పహల్గామ్ ఉగ్రదాడి పిరికిచర్య

– రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి



రాజంపేట : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. పహల్గామ్ ప్రాంతంలో ట్రెక్కింగ్‌లో ఉన్న పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేసిన ఘటన కశ్మీర్‌నే గాక దేశాన్నే కుదిపేయడంపై గురువారం ఆయన ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పహల్గామ్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి పిరికి చర్య అని పేర్కొన్నారు. ఈ దాడిలో పదుల సంఖ్యలో పర్యాటకులు చనిపోవడం, మరి కొంత మంది గాయపడటం తనను బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలానే దాడిలో మరణించిన వాళ్లలో ముగ్గురు తెలుగువాళ్లు ఉండటం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలబడాలని కోరారు.

గండికోట నుంచి కొనసాగుతున్న ఔట్ ఫ్లో

కొండాపురం : గండికోట జలాశయం నుంచి గండికోట ఎత్తిపోతలపథకం నుంచి మూడు మోటర్లతో పైడిపాళెం జలాశయంకు 300 క్యూసెక్కుల నీటిని కొనసాగిస్తున్నట్లు జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయంలో 18.5 టీఎంసీలు నిల్వ ఉన్నాయన్నారు. గాలేరి నగరి సృజల స్రవంతి ప్రధాన కాలువకు 300 క్యూసెక్కుల నీటిని శెట్టివారిపల్లె మెయిన్ రెగ్యులేటర్ ద్వారా సర్వరాయ సాగర్ కు ఔట్ ఫ్లో కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాన కాలువ నుంచి రైతాంగానికి సాగునీరు అవసరాల కోసం వదిలినట్లు ఆయన తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయంకు ఒక టీఎంసీ నీటిని తరలించామన్నారు. గురువారం మధ్యాహ్నం మైలవరం జలాశయంకు నీటిని నిలుపుదల చేశామన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని భారత్ పెట్రోలు బంకు సమీపంలో బుధవారం అర్ధరాత్రి బాకీ విషయమై ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కోటిరెడ్డినగర్‌కు చెందిన రమణయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. కడపకు చెందిన లారీ ఓనర్ దస్తగిరి అనే వ్యక్తి వద్ద రమణయ్య డ్రైవర్‌గా వస్తానని నమ్మబలికించి కొంత నగదును అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. అయితే లారీకి డ్రైవర్‌గా వెళ్లకుండా.. డబ్బులు తిరిగి చెల్లించకుండా కాలయాపన చేస్తుండటంతో బుధవారం దస్తగిరి బద్వేలుకు వచ్చి రమణయ్యను నిలదీశాడు. ఈ సమయంలో ఇరువురి మధ్య మాటమాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో దస్తగిరి తన వద్ద ఉన్న కత్తితో రమణయ్యను కడుపు భాగంలో, వీపు భాగంలో పొడిచాడు. ఇంతలో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని రక్తగాయాలైన రమణయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. దస్తగిరిని అదుపులోకి తీసుకున్నారు.

జల్ జీవన్ ప్రాజెక్టు పూర్తి చేయాలి

చక్రాయపేట : జల జీవన్ మిషన్ కింద చేస్తున్న పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు నీటిని అందించాలని నేషనల్ వాష్ ఎక్స్‌పర్ట్ (కేంద్ర పరిశీలన కమిటి) హర్యాణ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విజయకుమార్ సంబంధిత పనులు చేస్తున్న మెగా కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. గురువారం మండలంలోని కె.ఎర్రగుడి, కల్లూరుపల్లె గ్రామాల్లో జలజీవన్ మిషన్ కేంద్ర కమిటీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ ప్రాజక్టు కింద చేస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం వారు సర్పంచులు హరిశేఖర్‌నాయుడు, నాగరత్నమ్మల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం, నీటి సమస్య తదితరాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో బోర్లు వేయాలంటే ఎంత మేర ఖర్చు వస్తుంది. ఎంత లోపల నీరు ఉంది. నీటిలో ఫ్లోరైడ్ ఉందా.. వాటి పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. నీటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయ భాస్కర్, డీఈ సాలన్న తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు స్వాధీనం

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా రికార్డులు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధ, గురువారాల్లో మొత్తం 108 ద్విచ క్ర వాహనాలు, 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. అ నుమానితులు, పాత నేరస్తుల ఇళ్లలో తనిఖీలు చేశా రు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించా రు. కడప టూ టౌన్ పి.ఎస్ పరిధిలోని బిస్మిల్లా నగర్ లో నిర్వహించిన కార్డన్ అండ్ సర్చ్ లో 4 ద్విచక్ర వా హనాలను స్వాధీనం చేసుకున్నారు. కడప టూ టౌన్ సి.ఐ బి.నాగార్జున, ఎస్.ఐలు హుస్సేన్, సిద్దయ్య, చిన్నచౌక్ ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులో వెళుతూ వడదెబ్బతో మహిళ మృతి

సింహాద్రిపురం : మండలంలోని బలపనూరు గ్రామంలో గురువారం బస్సులో ప్రయాణిస్తున్న మహిళ వడదెబ్బకు గురై మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతురాలి అల్లుడు శివ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి నుంచి పులివెందులకు వస్తున్న ఆర్టీసీ బస్సులో యనమల భవాని(50) తన మనవరాలితో బయలుదేరింది. మధ్యాహ్నం సమయంలో బస్సులో మనుమరాలు ఏడుస్తున్నా భవాని నుంచి ఉలుకు పలుకు లేకపోవడంతో తోటి ప్రయాణీకులు ఆమెను లేపడంతో భవాని అక్కడే కుప్పకూలారు. దీంతో తోటి ప్రయాణీకులు ఆమెను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే వడదెబ్బకు గురై మృతి చెందినట్లు నిర్ధారించారు.

రిమ్స్ మార్చురీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో గత నెల 23న గుర్తు తెలియని వ్యక్తి (35) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వచ్చాడు. అతను చికిత్స పొందుతూ ఈనెల 23న మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను తగిన ఆధారాలతో సంప్రదించాలని రిమ్స్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

వీఆర్వోపై దాడి కేసులో విచారణ


తహసీల్దార్ భాగ్యలత, రెవిన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

గాలివీడు : గాలివీడు మండలం పందికుంట వీఆర్వో జయన్నపై జరిగిన దాడి ఘటనలో రాయచోటి డీఎస్పీ ఎస్.మహేంద్ర విచారణ చేపట్టారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన తహసీల్దార్ భాగ్యలత, సిబ్బందితో సమావేశమై దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత వీఆర్వోతో కలసి దాడి జరిగిన ప్రదేశంలో దాడి ఎలా జరిగిందన్న విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకున్నారు. ఈదాడి ఘటనలో సాక్షులుగా ఉన్న సిబ్బందిని వేరువేరుగా ఒక్కొక్కరిని విచారించి సమాచారం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసులో నిందితులుగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ హేమసుందర్ రెడ్డి ఆయన తండ్రి రామచంద్రా రెడ్డిపై ఇదివరకే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, ఆర్ఐ బాలాజీ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాంకేతిక సదస్సులకు ప్రాముఖ్యత


ప్రతిభ చాటిన విద్యార్థికి జ్ఞాపిక అందచేస్తున్న చొప్పా అభిషేక్ రెడ్డి

రాజంపేట : ఇంజనీరింగ్ విద్యలో జాతీయ సాంకేతిక సదస్సులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆ దిశగా అన్నమాచార్య యూనివర్సిటీ ముందుకెళుతోందని అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో ఛాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. కేఎస్ఆర్ఎంలో నిర్వహించిన సదస్సులో టెక్నికల్ సింపోజియం, ఏరా 2కె25 ప్రాజెక్టు ఎక్స్‌పో పేపర్ ప్రజెంటేషన్ ప్రదర్శించి రెండు జాతీయ సదస్సులలో ప్రతిభను చాటిన విద్యార్థినులు కీర్తి, హర్ష, వీణలను గురువారం అభినందిస్తూ జ్ఞాపికలను అభిషేక్‌రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీసీ డా.సాయిబాబరెడ్డి, రిజిస్ట్రార్ డా.మల్లికార్జున రావు, ప్రిన్సిపాల్ డా.నారాయణ, ఈఈఈ హెచ్‌వోడి పద్మలలిత తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

నందలూరు : మండలంలోని ఎర్రచెరువుపల్లిలో గత ఏడాది జరిగిన హత్య కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి వెంకటరెడ్డి అదే గ్రామానికి చెందిన నాగప్రతాప్ రెడ్డిల మధ్య కోడిపుంజు విషయమై 27, జూలై, 2024వ తేదీ గొడవ జరిగిందని, సత్తుపల్లి వెంకటరెడ్డి అనే వ్యక్తి నాగప్రతాప్ రెడ్డిని అసభ్యకరంగా తిట్టగా నాగప్రతాప్‌రెడ్డి మచ్చు కత్తితో వెంకటరెడ్డి తలమీద నరకగా వెంకటరెడ్డి మరుసటిరోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని అన్నారు. నిందితుడు అప్పటి నుండి పరారీలో ఉన్నాడన్నారు. కాగా రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బివి రమణ నందలూరు సిబ్బందితో నాగిరెడ్డిపల్లి గ్రామంలో పాత ఆర్‌అండ్‌బి బంగ్లా దగ్గర నిందితుడు నాగ ప్రతాప్ రెడ్డిని అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన మచ్చు కత్తి స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో తాగునీటి బోరు ప్రారంభంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం : మండలంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధి సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో రూ.20 లక్షలతో తాగునీటి బోరు, పైప్‌లైన్ ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఓబుల్‌రెడ్డిగారిపల్లె గ్రామానికి బోర్‌తో పాటు 3 కిలో మీటర్ల మేర పైప్‌లైన్‌తో నీటి సౌకర్యం కల్పించామని, తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామాన్ని గుర్తించి నీటి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఓబుల్‌రెడ్డిగారిపల్లె స్కీమ్ బోరును మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించి, కుళాయి వద్ద మహిళలకు బిందెలతో నీళ్లు పట్టించారు.

సాక్షి కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


డీఆర్ఓ మధుసూదన్ రావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న మీడియా ప్రతినిధులు

రాయచోటి టౌన్ : ఇటీవల ఏలూరులో సాక్షి ప్రాంతీయ కార్యాలయంపై దాడి చేయడమే కాకుండా రిపోర్టర్‌పై కూడా దాడికి ప్రయత్నించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మీడియా ప్రతినిధులు డీఆర్వోకు మధుసూధనరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. గురువారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో రాయచోటి డివిజన్ పరిధిలోని పలు దినపత్రికల ప్రతినిధులు కలసికట్టుగా వినతి పత్రాన్ని సమర్పించారు. పత్రిక స్వేచ్ఛకు భగం కలిగే విధంగా ప్రవర్తించడం హేయమైన చర్య అన్నారు. అంతకు ముందుగా కలెక్టరేట్‌కు ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు యం. ప్రభాకర్‌రెడ్డి, ఆర్. ఆంజనేయులు, జయ ప్రసాద్, బసవయ్య, వైవి శివయ్య, జనార్ధన్ రాజు, శ్రీరాములు, రాజ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న డిప్యూటి ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ అభ్యర్థులకు వరం లాంటిదని కడప ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన డీఎస్సీ ఉచిత కోచింగ్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని నిర్వహిస్తున్నదని, కేవలం 45 రోజులు మాత్రమే పరీక్షలకు సమయం ఉందన్నారు. ఈ పరిస్థితులలో డీఎస్సీ అభ్యర్థులు కోచింగ్ కోసం వేలాది రూపాయలను వెచ్చిస్తూ, సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన అవసరం లేకుండానే కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఉచితంగా కోచింగ్ ను నిర్వహించడం అభినందనీయమన్నారు. డీఎస్సీ అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే అద్భుత ఫలితాలను పొందవచ్చని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ విద్యా రంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ తన వంతు పాత్ర పోషిస్తోందన్నారు. డీఎస్సీ కోచింగ్‌లో శిక్షణ ఇచ్చే అధ్యాపకులు వి.బ్రహ్మయ్య, కోవెల ప్రసాద్ రెడ్డి, కె.సత్యానందరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, మహేష్, ప్రభాకర్, జి.గోపీనాథ్ లు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వంద మందికి పైగా డీఎస్సీ అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సుదర్శన్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్రిష్టారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కేదార్నాథ్, శంకర్ రెడ్డి, ప్రకాష్ బాబు, శివశంకర్, శివకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భార్యను బ్లేడ్‌తో గొంతుకోశాడు

సైదాపురం : భార్య భర్తల మధ్య మనస్పర్థల కారణంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో ఓ వ్యక్తి మంగళవారం రాత్రి బ్లేడుతో భార్య గొంతును కోశాడు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. ఈఘటనపై గురువారం పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కడప పట్టణంలోని శివానందపురానికి చెందిన ఊటుకూరు విష్ణుకు సైదాపురం మండలంలోని కలిచేడు గ్రామానికి చెందిన ప్రసన్నతో వివాహం జరిగింది. ప్రస్తుతం వారు కలిచేడు గ్రామంలో కాపురం ఉంటున్నారు. ఇటీవల భార్య భర్త మధ్య కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు భార్యపై అనుమానం పెనుభూతంగా మారింది. ఈనెల 22 వతేదీ రాత్రి 11 గంటల సమయంలో విష్ణు బ్లేడు తీసుకుని భార్య ప్రసన్న గొంతుపైన, గడ్డంపై, కుడిచేయి భుజంపైన కోశాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితురాలును కుటుంబ సభ్యులు నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసును నమోదుచేసి పరారీ ఉన్న విష్ణు ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.